క్లుప్తంగా

కార్పొరేషన్ చైర్మన్‌లను బర్తరఫ్ చేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: గత ప్రభుత్వ హయాంలో వివిధ కార్పొరేషన్లకు చైర్మన్‌లుగా నియామకమైన వారు ప్రభుత్వం మారినప్పటికీ రాజీనామా చేయకుండా అదే పదవుల్లో కొనసాగడం సమంజసం కాదని తెలంగాణ ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లిం కార్పొరేషన్ చైర్మన్లుగా ఉండి ప్రయోజనాలను కాపాడిందేమిలేదని, ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ కాలం గడిపినట్లు పేర్కొన్నారు. వారు వెంటనే పదవుల నుంచి తప్పుకోవాలని, లేనియెడల ప్రభుత్వమే బర్తరఫ్ చేయాలని కోరారు.

పెద్దవార్వాల్ ఫీల్డ్ అసిస్టెంట్ రాజీనామా

గండేడ్: పెద్దవార్వాల్ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ కాశీనాథ్‌రెడ్డి తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఉపాధిహామీ పథకం ప్రారంభం అయినప్పటి నుంచి ఆ గ్రామంలో ఇద్దరూ ఫీల్డ్ అసిస్టెంట్‌లు పని చేస్తున్నారు. వారిలో ఒకడైన కాశీనాథ్‌రెడ్డి తన వ్యక్తి గత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు గండేడ్ ఎంపీడీఓకు లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చారు. కాగా రాజీనామాను డీఆర్‌డీఏ పీడీకి పంపించనున్నట్లు ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఉన్న రెండో ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణతో ఆ గ్రామంలో ఉపాధి పనులు చేపడుతామని వివరించారు.

మంత్రి పదవి కేటాయించాలి

గండేడ్: పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి మంత్రి పదవి కేటాయించాలని పీసీసీ మెంబర్ నరసింహరావు, గండేడ్ మండల పార్టీ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, వెన్నాచేడ్ సర్పంచ్ పుల్లారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. దాదాపుగా పదిహేనేళ్లుగా కాంగ్రెస్‌ను కాపాడుతూ ప్రతి ఒక్కరికి అండగా ఉంటూ వచ్చారన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు సునీత, గండేడ్ ఎంపీటీసీ బాలయ్య, కొంరెడ్డిపల్లి సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు 'దీటు'గా..

- గండేడ్ పీహెచ్‌సీలో ఉత్తమ సేవలు
- పెరుగుతున్న కాన్పులు...
- కిక్కిరుస్తున్న ఓపీ..
- పరిశుభ్రతలో నంబర్ వన్..
- ఎన్‌క్వాస్ కింద ఎంపిక..


వైద్యం కోసం వచ్చిన మహిళలు


రక్త నమునాల సేకరణ

గండేడ్: 'నరకానికి నకళ్లు సర్కారు దవాఖానాలు' అనేది ఒకప్పటి మాట. కానీ నేడు అవే సర్కారు ఆస్పత్రులు సేవలు అందించడంలో నేడు ఉత్తమంగా నిలుస్తున్నాయి. జాతీయ నాణ్యత ప్రమాణాలకు (ఎన్‌క్వాస్) అనుగుణంగా గ్రామీణులకు చక్కటి సేవలు అందిస్తూ సంపూర్ణ ఆరోగ్య సాధనకు ప్రభుత్వ ఆస్పత్రులు తోడ్పడుతున్నాయి. గండేడ్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఇందుకు చక్కని ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఇటీవల ఈ ఆరోగ్య కేంద్రం ఎన్‌క్వాస్ కింద ఎంపికైంది. మారుమూల ప్రాంతంలో ఉన్న గండేడ్ ఆరోగ్య కేంద్రానికి ఒకపుడు ఎలాంటి గుర్తింపు ఉండేది కాదు. ఇక్కడ పనిచేయడానికి కూడా ఎవరూ సిబ్బంది వచ్చేవారు కాదు. పక్కా భవనం ఉన్నా సేవలు మాత్రం అంతంమాత్రంగా ఉండేవి. కానీ ఇప్పుడు అదే ఆరోగ్య కేంద్రం ఆదర్శంగా నిలుస్తోంది. మండలపరిధిలో 27 గ్రామపంచాయతీలు ఉండగా అన్ని గ్రామాల్లో కలిపి దాదాపు లక్ష వరకు జనాభా ఉంది. వీరికి వైద్య సేవలు అందించేందుకు గాను ఆరు సబ్‌సెంటర్లు ఉన్నాయి. మండల కేంద్రంతో పాటు జక్లపల్లి, పగిడ్యాల్, సల్కర్‌పేట్, రెడ్డిపల్లి, వెన్నాచేడ్ గ్రామాల్లో సబ్‌సెంటర్లు ఉన్నాయి. వీటిలో వెన్నాచేడ్, జక్లపల్లి, పగిడ్యాల్‌లలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ డాక్టర్లు ఉండగా మండల ఇద్దరు వైద్యాధికార్లకు గానూ ఒకరు ఉన్నారు. వీరంతా ఆయా గ్రామాల్లో వైద్యసేవలు అందిస్తున్నారు. మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రం అయితే వసతుల్లో సేవల్లో ఆదర్శంగా నిలుస్తోంది. నిత్యం రోగులకు పూర్తిస్థాయిలో సేవలు అందించడంలో వైద్యాధికారి చంద్రశేఖర్, సిబ్బంది సక్సెస్ అవుతున్నారు.

ఎన్‌క్వాస్ కింద ఎంపిక...

గండేడ్ ఆరోగ్య కేంద్రానికి ఒక్కసారిగా జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. ఇప్పటి వరకు జిల్లాకే పరిమితం అయిన ఈ ఆరోగ్య కేంద్రం. ఎన్‌క్వాస్ కింద ఎంపికై ంది. ఆరోగ్య కేంద్రంలో జాతీయ స్థాయి నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నట్లు కేంద్ర బృందం నిర్ధారించింది. సెప్టెంబర్ నెలలో కేంద్ర బృందం సభ్యులయిన ఢిల్లీ, పశ్చిమబెంగాల్ వైద్యులు ప్రశాంత్‌నాయక్, మౌసమ్ ఘోష్ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఓపీ, ఐపీ రిజిస్టర్లతో పాటు లేబర్ రూం, ల్యాబ్, ఫార్మసీ వంటి అనేక అంశాలను పరిశీలించారు. దీంతోపాటు పరిసరాలు పచ్చదనం, పరిశుభ్రత వంటి వాటిని పరిగణనలోకి తీసుకున్నారు. పూర్తి నివేదికను జాతీయ వైద్య మండలికి సమర్పించడంతో గండేడ్ పీహెచ్‌సీలో జాతీయ నాణ్యతా ప్రమాణాలు ఉన్నట్లు గుర్తింపు లభించింది. ఈమేరకు ధ్రువీకరణ పత్రం సైతం జారీ చేశారు. దీంతో పీహెచ్‌సీ రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ఇప్పటివరకు రాష్ట్రం నుంచి నిధులు అందేవి. ఇక నుంచి కేంద్రం కంట్రోల్‌లో ఈ పీహెచ్‌సీ ఉండనుంది. అక్కడి నుంచే దీనికి సంబంధించిన నిధులు వసతులు సమకూరనున్నాయి. దీంతో గ్రామీణులకు మరిన్ని మెరుగైన సేవలు అందనున్నాయి.

సంతోషంగా ఉంది



గండేడ్ పీహెచ్‌సీకి గుర్తింపు తేవాలన్న సంకల్పంతో ఆరు నెలలుగా కృషి చేశాం. వసతులు సమకూర్చడం వంటి చర్యలు చేపట్టాం. ఎన్‌క్వాస్ కింద ఎంపిక కావడం సంతోషంగా ఉంది. దీంతో పీహెచ్‌సీ రూపురేఖలు మారుతాయి. ప్రభుత్వం సహకరిస్తే అన్ని రకాల వసతులు కల్పించాలన్నదే ఆకాంక్ష.

– చంద్రశేఖర్, వైద్యాధికారి, గండేడ్

ప్రైవేటు ఆస్పత్రులతో పోటీపడుతూ..

గండేడ్ పీహెచ్‌సీలో ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా వసతులు ఉన్నాయి. ఆరు బెడ్లతో ఇక్కడ ఉన్నదాంట్లో మెరుగైన వసతులు ఉన్నాయి. ఆపరేషన్ థియేటర్‌తో పాటు మహిళల కాన్పుకు థియేటర్, చిన్నపిల్లలకోసం ఇంక్యుబేటర్, మూడు ఆక్సిజన్ సిలిండర్లు ఉన్నాయి. కోవిడ్ సమయంలో వీటిని వినియోగించారు. ఇవేకాకుండా ఇక్కడ అనేక ఆరోగ్యసంబంధ పరీక్షలు రోగులకు చేస్తున్నారు. అవసరమైన మందులు కూడా అందిస్తున్నారు.

పెరిగిన కాన్పులు, ఓపీ

పీహెచ్‌సీలో కాన్పుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అంతేకాకుండా ఇక్కడి సిబ్బంది సైతం ఆస్పత్రికి వచ్చేవారిని చైతన్యం చేస్తున్నారు. ప్రభుత్వాస్పత్రిలో కాన్పులు జరిగేలా కృషి చేస్తున్నారు. అంతేకాకుండా ఇక్కడ రోగుల కోసం కుర్చీలు, తాగునీరు, మరుగుదొడ్లు, టీవీ వంటి ఎన్నో సౌకర్యాలు కల్పించారు. ఉత్తమ సేవలు అందుతుండడంతో ఓపీ సంఖ్య విపరీతంగా పెరిగింది. అంతేకాకుండా పచ్చని వాతావరణం ఇక్కడికి వచ్చే వారికి ఆహ్లాదం కలిగిస్తోంది. గ్రామీణులు సేవలపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎన్‌క్వాస్ కింద ఎంపిక కావడంతో మరింత మెరుగైన సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నేడు కార్తీక వనభోజనాలు

జడ్చర్ల టౌన్: మండలంలోని గొల్లపల్లి వద్ద ఉన్న సద్గురు మలయాళస్వాముల లలితాంబికా తపోవనంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో శనివారం వనభోజనాలు నిర్వహిస్తున్నట్లు నగర కార్యావహ సురేష్ తెలియజేశారు. ఈ సందర్భంగా గోపూజ, హనుమాన్ చాలీసా పారాయణం, కార్యక్రమ ఉద్ఘాటన, సామూహిక పరిచయం, కథలు, పాటలు, భజనలుంటాయన్నారు. మధ్యాహ్నం క్విజ్ పోటీలు, భోజనాలు, ముఖ్య అతిథుల సందేశం ఉంటుందన్నారు.

ప్రతిపక్ష పాత్ర సమర్థవంతంగా పోషిస్తాం



గండేడ్: ప్రతిపక్ష పాత్ర సమర్థవంతంగా పోషిస్తూ.. ప్రజలకు అండగా ఉంటామని పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉమ్మడి మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తామన్నారు. ఎల్లప్పుడూ ప్రజల్లోనే ఉంటామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే.. ప్రజల తరపున వారితో పోరాడుతామన్నారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ ఈశ్వరయ్య గౌడ్, పార్టీ అధ్యక్షులు పెంట్యానాయక్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముస్తాబు


సిద్ధమవుతున్న ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. అప్పటి బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో శాసన సభ్యుని నివాస, కార్యాలయ భవనాన్ని నిర్మించారు. కాగా ప్రస్తుతం మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా యెన్నం శ్రీనివాస్‌రెడ్డి గెలుపొందారు. ఈనేపథ్యంలోనే శాసన సభ్యుని నివాస, కార్యాలయాన్ని ముస్తాబు చేయిస్తున్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజల క్యాంప్ కార్యాలయంగా మరుస్తామని ప్రకటించారు.

హెచ్‌డీఎఫ్‌సీలో రక్తదాన శిబిరం

పాలమూరు: హెచ్‌డీఎఫ్‌సీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని హెచ్‌డీఎఫ్‌సీ మెయిన్ బ్రాంచ్‌లో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని బ్యాంకు క్లస్టర్ అధికారి ఎస్.ఎస్ కె త్రివిక్రమ్, బ్రాంచ్ మేనేజర్‌రాజశేఖర్, రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ ప్రారంభం చేశారు. ఆ తర్వాత బ్యాంకులో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన 72మంది ఉదోగ్య, సిబ్బందిని అభినందిస్తూ ప్రశంశ పత్రాలు అందించారు. బ్యాంకు సిబ్బంది రజినీకాంత్, అశ్విని, శివకుమార్ పాల్గొన్నారు.

భగవద్గీత, భక్తి పాటల కంఠస్థ పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జడ్చర్ల టౌన్: గంగాపురం వద్ద ఉన్న మలయాళ స్వామి లక్ష్మీనారాయణ ఆశ్రమం 19వ వార్షికోత్సవం పురస్కరించుకుని శుక్రవారం వివిధ పాఠశాలల విద్యార్థులకు భగవద్గీత పద్యాలు, భక్తియోగ కంఠస్థ పోటీలు నిర్వహించారు. సంస్కార భారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ చేస్తున్న సేవలకు శాలువా, షీల్డుతో ఆశ్రమ నిర్వాహకుడు పరమాత్మ నందగిరి స్వామి సత్కరించారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. జాతీయ సాహిత్య పరిషత్ సభ్యుడు మహేశ్వర్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించాలి


రికార్డులను పరిశీలిస్తున్న నోడల్ అధికారి

దేవరకద్ర రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొదించాలని మండల నోడల్ అధికారి బలరాం అన్నారు. శుక్రవారం లక్ష్మీపల్లి, బస్వాయపల్లి, చౌదర్‌పల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఎఫ్‌ఎల్‌ఎన్ అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలన చేసి విద్యార్థుల హాజరుశాతం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, అశ్విని, బాసిత్, కల్పన తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తాచాటిన విద్యార్థులు


పోటీలకు ఎంపికైన మిడ్జిల్ విద్యార్థులు

మిడ్జిల్: ఉమ్మడి జిల్లా స్థాయి రగ్బీ పోటీల్లో మిడ్జిల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మానస, విష్ణు ఉత్తమ ప్రతిభ కనబర్చారని.. ఈనెల 12న జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీడీ పరుశరామ్ తెలిపారు. విద్యార్థులను శుక్రవారం పాఠశాల హెచ్‌ఎం సరస్వతి, ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి

బాలానగర్: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని వీ.నందిని జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైందని కోచ్ కృష్ణయ్య తెలిపారు. ఈ నెల 16 నుంచి ఢిల్లీలో జాతీయ క్రీడలు జరగనున్నాయని వివరించారు. శుక్రవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, పీఈటీ అరుణ, తదితరులు విద్యార్థిని సత్కరించినట్లు వివరించారు.


నందినితో ప్రిన్సిపాల్ తదితరులు

షూటింగ్‌బాల్ పోటీలకు టిమిరీస్ విద్యార్థులు

మహబూబ్‌నగర్ క్రీడలు: నల్లగొండ జిల్లా చర్లపల్లిలో శనివారం, ఆదివారాల్లో జరిగే రాష్ట్రస్థాయి అండర్–19 షూటింగ్‌బాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని టిమిరీస్ ఒకేషనల్ జూనియర్ కళాశాల బాలుర–3 విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ సమీ తెలిపారు. విద్యార్థులను విజిలెన్స్ అధికారులు జమీర్‌ఖాన్, ఆలం ఖాన్, పీఈటీ గులాం అఫ్రోజ్ అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభచాటాలని వారు కోరారు.


విద్యార్థులతో గురుకుల అధికారులు

వాలీబాల్ స్టేట్ టీంకు నవాబుపేట విద్యార్థి

నవాబుపేట: వాలీబాల్ స్కూల్ లేవల్ రాష్ట్ర జట్టుకు నవాబుపేట జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థి ప్రశాంత్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం నాగ్యానాయక్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో విద్యార్థిని ప్రజాప్రతినిదులు, అధికారులు అభినందించారు. సర్పంచ్ గోపాల్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహులు, సీఆర్‌పీ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.


ప్రశాంత్‌తో అధికారులు, ప్రజాప్రతినిధులు

బిల్లులు చెల్లించకపోతే చర్యలు


దేశాయిపల్లిలో ఇంకుడుగుంతలను పరిశీలిస్తున్న అధికారులు

మహమ్మదాబాద్: దేశాయిపల్లిలో రెండు మూడేళ్ల క్రితం నిర్మించిన ఇంకుడుగుంతల నిర్మాణమై లబ్ధిదారులకు బిల్లులు రాలేదన్న ఫిర్యాదుతో శుక్రవారం అధికారులు పరిశీలించారు. ఈజీఎస్ అంబుడ్స్‌మెన్ సంతోష్ నిర్మాణాలను పరిశీలించారు. గ్రామంలో ఎన్ని గుంతలు ఏర్పాటు చేశారు, ఎన్నింటికి బిల్లులు అందలేదు వంటి అంశాలపై లబ్ధిదారులతో మాట్లాడారు. బిల్లులు చెల్లించకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎంతమందికి బిల్లులు చెల్లించలేదన్న విషయమై లిఖిత పూర్వకంగా తీసుకోవాలని సూచించారు. కాగా గ్రామంలో మొత్తం 50వరకు ఇంకుడు గుంతలు తీసుకోగా 20వరకు పనులు పూర్తయ్యాయని.. మరో 30వరకు పనులు పూర్తి కాకపోవడంతో బిల్లులు చెల్లించలేదని అధికారులు తెల్పుతున్నారు. ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, ఏపీఓ హరిచ్చంద్రుడు, టీఏ ఆంజనేయులు, కార్యదర్శి రవి గ్రామస్తులు ఉన్నారు.

ప్రమాదాలకు నిలయంగా పెద్దాయపల్లి కూడలి


పెద్దాయపల్లి కూడలి

- అండర్‌పాస్ లేక తరుచూ ప్రమాదాలు
- బారికేడ్లు ఏర్పాటు చేసినా ఫలితం అంతంతే..


గతంలో రోడ్డు ప్రమాదానికి గురైన కారు(ఫైల్)

బాలానగర్: మండల పరిధిలోని జాతీయ రహదారి–44పై పెద్దాయపల్లి గ్రామ కూడలి తరుచూ ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రమాదాలు జరిగే ప్రాంతమని గుర్తించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. సంబంధిత నేషనల్ హైవే అధికారులు, టోల్‌ప్లాజా అధికారులు అంతంత మాత్రంగానే చర్యలు చేపట్టారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాధారణంగా జాతీయరహదారి నుంచి పరిసర గ్రామాలకు వెళ్లే ముఖ్య కూడళ్లలో రెండు లైన్లుగా ఉన్న రహదారిని కనీసం 50 మీటర్లు మూడు లైన్లుగా, వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని నాలుగు వరసలుగా నిర్మాణం చేస్తారు. కానీ పెద్దాయపల్లి కూడలి వద్ద గ్రామం వైపుగా నాలుగు వరుసల రోడ్డు ఏర్పాటు చేయగా.. మరోవైపు గుండేడ్, ఉడిత్యాల గ్రామాల వైపుగా ఉన్న జాతీయరహదారి కేవలం రెండు వరుసలు వేసి వదిలేశారు. దీంతో గుండేడ్ గ్రామం వైపు తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

గుండేడ్ వైపుగా జాతీయరహదారిపైకి వచ్చే భారీవాహనాలు దాదాపు రెండులైన్ల రోడ్డును ఆక్రమించుకొని యూ టర్న్ తీసుకుంటాయి. దీంతో అటువైపుగా వచ్చే వాహనాలు వేగంగా రావడంతో అదుపు తప్పి యూటర్న్ చేస్తున్న వాహనాలను, రోడ్డు దాటుతున్న వాహనాలను ఢీకొనడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మండల కేంద్రం నుంచి నవాబ్‌పేట్ మండలంతోపాటు, ఉడిత్యాల, నేరళ్లపల్లి, రాఘవాపూర్, చొక్కంపేట్, సూరారం, వీరన్నపల్లి, జాలుగడ్డ, వాయిల్ కుంట, ఊటకుంట, ఈదమ్మగడ్డ, గుండేడ్, చెన్నంగులగడ్డ, చింతకుంట తండా గ్రామ పంచాయతీలతో పాటు పదుల సంఖ్యలో ఉన్న తండాలకు వెళ్లేవారు అధికంగా ఉంటుండంతో సాధారణంగా వాహనాల రద్దీ అధికంగా ఉంటోంది. అయినప్పటికీ ముఖ్య కూడలిలో రోడ్డు రెండు లైన్లుగా మాత్రమే ఉండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆయా ఘటనల్లో పలువురు మృత్యువాత పడిన సందర్భాలూ లేకపోలేదు.

అండర్‌పాస్ లేదా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

జడ్చర్ల వైపు నుంచి బాలానగర్ వచ్చే వాహనాలకు ఎటువంటి అడ్డంకి లేకపోవడంతో వేగంగా వస్తుంటాయి. దీంతో ముఖ్యకూడలిలో రోడ్డు దాటే వాహనాలను ఢీకొంటూ ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. అటువైపుగా వచ్చే వాహనాల వేగాన్ని నియంత్రించడానికి బారికేడ్లు ఏర్పాటు చేసినా, బ్లింకింగ్ సిగ్నల్ ఏర్పాటు చేసినా ఫలితం అంతంతమాత్రమే కనిపిస్తోంది. దీంతో సబ్‌రోడ్డు, రోడ్డు విస్తరణతోపాటు, బ్రిడ్జి నిర్మాణం చేస్తేనే ప్రమాదాలు జరగకుండా శాశ్వత పరిష్కారం లభించనుందని మండల ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

ఫ్లైఓవర్ నిర్మించాలి

ప్రధాన కూడలిలో రెండు లైన్లుగా ఉన్న రోడ్డును నాలుగు లైన్లుగా మార్చడంతోపాటు అంతర్గత రోడ్డు లేదా బ్రిడ్జి నిర్మాణం చేస్తేనే ప్రమాదాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. ఈ దిశగా గతంలో అధికారులకు సైతం విన్నవించాం. ఇప్పటికైనా చర్యలు చేపట్టి సమస్య పరిష్కరించాలి.

– చెన్నారెడ్డి, గుండేడ్

చర్యలు చేపట్టాం



జాతీయరహదారిపై ప్రమాదాల నివారణకు జిల్లా ఎస్పీ సూచనల మేరకు బారికేడ్లు సైతం ఏర్పాటు చేశాం. అంతేకాకుండా వాహనదారులకు తరుచూ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. రోడ్డు విస్తరణ సమయంలో అండర్‌పాస్ నిర్మాణానికి నివేదికలు సిద్ధం చేసి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు నివేదించాం.

– ఎస్సై శ్రీనివాస్, బాలానగర్

నివేదికలు పంపించాం

బాలానగర్ మండల కేంద్రంతోపాటు, పెద్దాయపల్లి ముఖ్య కూడలిలో గ్రీన్‌ఫీల్డ్ రహదారిగా మారనున్న నేపథ్యంలో నాలుగు వరసలుగా ఉన్న బీటీ రోడ్డు ఆరు వరసలుగా మారడంతోపాటు అండర్‌పాస్‌లు, సబ్ రోడ్ల నిర్మాణం చేపడతాం. అందుకు సంబంధించిన అన్ని చర్యలు చేపట్టాం. నివేదికలు పంపించాం. వాహనదారులకు సైతం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం.

– ఇబ్రహీం, రాయికల్ టోల్‌ప్లాజా మేనేజర్

రేవంత్‌రెడ్డి అభిమానుల పాదయాత్ర



అడ్డాకుల: రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో ఆయన అభిమానులు తిరుపతికి చేపట్టిన పాదయాత్ర శుక్రవారం మూసాపేట, అడ్డాకుల మండలాల్లోని 44వ నంబర్ జాతీయ రహదారిపై సాగింది. కొడంగల్ నియోజకవర్గం నాగిరెడ్డిపల్లికి చెందిన నందిగామ నర్సిములు, కె.రఘుపతి మూడు రోజుల క్రితం స్వగ్రామం నుంచి పాదయాత్ర మొదలు పెట్టారు. కాంగ్రెస్ జెండాను చేతపట్టి చేస్తున్న యాత్ర కోస్గి, మహబూబ్‌నగర్, భూత్పూర్ మీదుగా మూసాపేట, అడ్డాకుల మండలాల్లో కొనసాగింది. సీఎం అయితే తిరుపతికి పాదయాత్రగా వస్తామని మొక్కుకున్నందున పాదయాత్ర చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

మొక్కులు తీర్చుకున్న నాయకులు

రాజాపూర్: జడ్చర్ల ఎమ్మెల్యేగా జనంపల్లి అనిరుధ్ రెడ్డి గెలుపొందడంతో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు, అభిమానులు మండల కేంద్రంలోని దర్గా వద్ద మొక్కులు చెల్లించారు. నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు గోవర్ధన్‌రెడ్డి, గోనెల రమేష్,గౌస్, తఖీబాబా, నసీర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

స్వీట్ల పంపిణీ

స్టేషన్ మహబూబ్‌నగర్: రేవంత్‌రెడ్డి సీఎం అయిన సందర్భంగా అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం స్టేషన్ ఏరియాలోని మజీద్ ఆవరణలో శుక్రవారం ముస్లింలకు స్వీట్లు పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా, ప్రధాన కార్యదర్శి మహ్మద్ యాఖూబ్, మౌలానా గులాం మహ్మద్, రహిమాన్ సోఫీ, ఎస్‌ఎం.పాష, షేక్ మహమూద్, ఆరిఫ్, అహ్మద్, మహ్మద్ సలీం తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వంతెన



నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్ వద్ద కొన్నేళ్లగా నిర్మాణం చేసిన ఇరుకై న వంతెన నిర్మాణం ప్రమాదకరంగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ వంతెనకు ఇరువైపుల ఉన్న రక్షణ రాళ్లు పడిపోవడం, వంతెన పూర్తిగా దెబ్బతిని వంతెనపై గోతులు పడి ప్రయాణం ప్రమాదకరంగా మరిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ బ్రిడ్జిపై ప్రమాదాలు చోటు చేసుకున్నట్లు తెలిపారు. రెండు మార్లు గద్వాల, మక్తల్ రహదారిని మరమ్మతు చేసి రోడ్డు వేశారు తప్పా.. ఈ మార్గంలో ఉన్న కొండదొడ్డి, పెద్దకడ్మూర్‌ల వద్ద ఉన్న ఈ బ్రిడ్జిలపై ఎలాంటి మరమ్మతు చేపట్టకపోవడంతో రోజు రోజుకు బ్రిడ్జి నాణ్యత దెబ్బతిని గోతులు ఏర్పడుతున్నాయని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రోడ్డు వేస్తుండగా.. ఈ బ్రిడ్జిలపై సీసీ రహదారి లేదా తారు రోడ్డు వేస్తే ప్రయాణ ఇబ్బందులు తీరుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ ఈ పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.